# ప్రేమ వెలుగు

–డా॥ టి. పతంజలి

కాలింగ్ బెల్ నొక్కబోతూ, లోపలి మాటలు వినిపించి ఆగాడు పాండురంగ.

"నా ఖర్మకాలి మిమ్మల్ని చేసుకొన్నాను"

"నీ ఖర్మ కాదే... నా ఖర్మ... అప్పటికీ మా పెద్దక్కయ్య చెబుతూనే ఉంది. అమ్మాయిని చూస్తుంటే అనుమానంగానే ఉంది... చేసుకుంటే ఇబ్బంది పడతావేమోరా అని... అయినా నా బుద్ధుంది చూడు... నీలాంటిదాన్ని ఏరి కోరి చేసుకున్నాను చూడు... నా ఖర్మ..."

"అబ్బో... మీ అక్కయ్య పెద్ద పత్తిత్తు... దాని వెదవ్వేషాలు నాకెందుకు తెలియవు.. పైకంతా మా ఆయనదే అంటుంది. అసలు చక్రమంతా దాని దగ్గరే ఉంది.."

"ఏమిటే.. పెద్దా చిన్నా గౌరవం లేదా! వదినగారిని పట్టుకొని అది ఇది అంటావా... ఎదుటి వాళ్ళని గౌరవించడం సంస్కారం.. అవన్లే.. మీ కుటుంబంలోనే అది లేదు.. అందరూ దగుల్బాజీలు.."

"మా వాళ్ళు కాదు.. మీ వాళ్ళే పుండాకోరులు.."

"ఏమిటీ.. మా వాళ్ళని అంతమాటంటావా?"

"ఏం.. మా వాళ్ళని అంటే నేననానా?"

"నిన్నూ..."

దభీ దభీమని చప్పుడుళ్ళు...

ఇప్పుడేమిటి చేయడం? వెనక్కి తిరిగి వెళ్ళిపోదామా అనుకున్నాడు పాండురంగ.

కాని రామచంద్రాన్ని పిలవకుండా వెళ్ళటం పాండురంగకి ఇష్టం కాలేదు.

అందుకే – గత్యంతరం లేక – కాలింగ్ బెల్ నొక్కాడు.

"ఆ.. వస్తున్నా.." రామచంద్రం మాటలు వినిపించాయి. మరో నిమిషం తర్వాత తలుపు తెరచి" రా.. రా.. చాలా కాలానికి మా ఇంటికి వచ్చావ్... హార్టీ వెల్‌కమ్ అంటూ ఆహ్వానించాడు రామచంద్రం.

ఒక్క నిమిషం అతని మొఖంకేసి చూశాడు పాండురంగ. ఇందాకటి వరకు-భార్యతో తగాదా పడిన చిహ్నాలేవీ మొఖంలో కనబడలేదు. బలవంతాన నవ్వు రంగు పులుముకొంటున్నట్లు అనిపించింది పాండురంగకి.

"ఏమిట్రా.. అలా తదేకంగా నా మొఖంలోకి చూస్తున్నావ్... ఏమన్నా కోతులాడుతున్నాయా?" తను జోక్ చేశానని భావించి, తనే మొదట నవ్వాడు రామచంద్రం.

"అబ్బే... కోతులు కాదు... చాలా రోజులయింది గదా! ఊరికే ఆపేక్షతో చూశాను... అంతే" సమర్థించుకున్నాడు పాండురంగ.

"నువ్వు మంచి యాక్టర్‌వి. క్షణాల్లో ముఖంలో భావాలు మార్చేస్తావ్.." అని అనాలనుకున్నాడు పాండురంగ.

ఎంతటి దగ్గరివాళ్ళయినా ఉన్నదున్నట్లు అన్ని విషయాలు చెప్పలేము. చెబితే బాధపడతారనిపించినప్పుడు చెప్పకపోవటమే మంచిది. అందుకే పాండురంగ మనస్సులోని భావాన్ని ప్రకటించలేకపోయాడు.

"ఊ.. ఏమిట్రా... విశేషాలు" సోఫాలో రిలాక్స్‌గా కూర్చున్న పాండురంగాన్ని రామచంద్ర అడిగాడు.

"ఏమున్నాయి నాయనా! జీవితమే సశేషమయినప్పుడు ఇంక విశేషాలేముంటాయ్!" పాండురంగ కూల్‌గా అన్నాడు.

"అబ్బో... ఏమిట్రోయ్.. టన్నుల బరువున్న డైలాగ్ కొడుతున్నావ్. ఏం కష్టం వచ్చిందిరా బాబు.. నీకు.. కొంపదీసి మీ శ్రీమతి కొత్తగా చదువుతున్న వంటల పుస్తకం ప్రయోగాలేమన్నా నీ మీద చేస్తోందా?" రామచంద్రం నవ్వుతూ అన్నాడు.

"వంటి ప్రయోగాలు, వంటల ప్రయోగాలు అన్నీ దాటొచ్చాంరా అబ్బాయ్... నాకలాంటి ప్రాబ్లమ్స్ ఏమీ లేవుగాని.. మా చెల్లాయి కనిపించదేం...?" పాండురంగ – రామచంద్రం ముఖంలోకి చూస్తూ అన్నాడు.

"ఏమో నాయనా... పొద్దున్నించి ఆ వంటింట్లోనే కూలబడింది.. ఇవాళ సెలవుగదా.. మీకు వెరైటీగా రెండు స్వీట్లు, హాట్లు చేసిపెడతానని.. పుల్లారెడ్డి నుంచి తెచ్చుకొందామంటే వినదు... తను స్వయంగా నాకు చేసి పెడితే అదో ఆనందంట.. ఏమోరా బాబు.. ఈ ప్రేమ తట్టుకోలేక చస్తున్నాను.."

"ఎంతో అ..దృ..ష్ట..వం..తు..డి..వి.." అక్షరాలను నొక్కిపెడుతూ అన్నాడు పాండురంగ.

"అదేందిరోయ్.. అదో రకంగా మాట్లాడుతున్నావ్.." రామచంద్రం – తను దాచిపెట్టిన విషయాలేవైనా తెలిసిపోయాయా అన్న ఆదుర్దాలో అడిగాడు.

"ఏం.. లేదురా.. ఎంతమంది ఈ రోజుల్లో నీలాంటి అదృష్టవంతులుంటారు. ప్రేమే దొరకలేదని ఏడుస్తున్న వాళ్ళని చాలామందిని చూస్తున్నాను. నీలాగా ప్రేమ ఎక్కువయిందని ఏడ్చేవాళ్ళు అసలు కనబడలేదు.." అంటూ పాండురంగ అంటుండగానే "నమస్కారమండి.. అన్నయ్యగారు" రామచంద్రం భార్య వసంత ట్రేలో మంచినీళ్ళ గ్లాసులు, టీ కప్పులు పెట్టుకొని వస్తూ అంది.

"నమస్తే.." అంటూ వసంతను పరిశీలనగా చూశాడు పాండురంగ.

ఎక్కడా డిస్టర్బ్ అయిన ఛాయలు లేవు.

కళ్ళు మాత్రం ఏడ్చిన దాఖలాతో ఉబ్బిపోయినట్లు కనిపించాయి.

"ఆ.. ఏ.. మ్మా.. ఏంటి విశేషాలు" మంచినీళ్ళు త్రాగి టీగ్లాసు అందుకొంటూ అడిగాడు పాండురంగ.

"మాకేముంటాయి.. మీరే చెప్పాలి.." వసంత జవాబిచ్చింది.

"అదికాదమ్మా.. ఏవో స్వీట్ల విశేషాలు చేస్తున్నావని రామచంద్రం చెప్పాడు. స్వీట్ ఒక్కటుంటే ఏం బాగుంటుంది.. హాట్ కూడా ఉండాలి గదా! ముందే అయిపోయిందా?"

పాండురంగ మాట తగలవలసిన చోట తగిలింది వసంతకు. కన్నీళ్ళని పాండురంగకి కనబడనీయకుండా, గబగబా పైట కొంగుతో ఒత్తుకొని, గిర్రున లోపలికి వెళ్ళింది.

"రామచంద్రం! ఇప్పుడేమన్నా అర్జెంటు పనుందా నీకు!" పాండురంగ – టీ త్రాగిన తర్వాత అడిగాడు మౌనాన్ని ఛేదిస్తూ.

"ఏం.. లేదురా.." రామచంద్రం అన్నాడు.

"పద... అలా వెళ్ళొద్దాం.."

"ఎక్కడికి.."


"ఏం.. చెప్తేగాని రావా?" పాండురంగ ప్రశ్నించాడు.

"అది కాదు.. ఏం పనిమీద వచ్చావో తెలుసుకుందామని" రామచంద్రం నసుగుతూ అన్నాడు.

"చాలా ముఖ్యమైన పనిమీద వచ్చాను. అది చెప్పడానికే కదా నిన్ను రమ్మంటోంది."

"ఏం.. ఇక్కడ చెప్పకూడదా?" రామచంద్రం అడిగాడు.

"ఒరేయ్.. వాదనొద్దు.. వస్తావా.. రావా.." ఇరవై



## మట్టి మనుషులు

గుండెలన్నీ కూడదీసుకుని
కన్నీళ్లన్నీ ఒకచోట పోగేసి
గొడ్డూ గోదాని అమ్మేసి
దూర తీరాలకు పోతున్నాం
బతుకు సాగినంతకాలం బతికి
మళ్లీ పచ్చని జీవితాలతో తిరిగొస్తాం
ఇక్కడ బీడు భూములు
పాడుపడిన దేహాల్లా రాలకముందే
మీరు మరోచోటుని వెతుక్కోండి
మనం చేసేది ఉద్యోగం కాదు ఊడిగం
ఊడిగం చేయడానికి ఏ ఊరైతే మనకేంటి?
ఒంట్లో సత్తువ ఉన్నంతవరకు
ఏ పనైనా మనకి ఒక్కటే
మట్టికి మనిషికి తేడా తెలిసినోళ్లం
మట్టిని మనిషిని విడదీయలేమని తెలిసినా
మట్టిని విడిచి మరోచోటుకి వెళ్లక తప్పదు
అక్కడ మళ్లీ మనం మట్టిలోంచే జీవితాన్ని
మొదలెట్టాలి
మట్టిని విడిచి మనం బతకలేం
మనసు పొరల్లో మట్టిని నింపుకుని
జీవితాన్ని ముందుకి వెనక్కి నెట్టుకురావాలి
ఇదే మట్టికి మనకున్న సంబంధం
మనతోపాటు మన పిల్లలు
ఇటుక బట్టీల్లో ఇటుకలై
సిమెంటు గమేళాల్లో ఇసుక రేణువులై
మనతోపాటు ప్రయాణం చేస్తూనే ఉన్నారు
ఖాళీగ కూర్చోడం మనపిల్లలకు అచ్చిరాలేదు
బడిలో కూర్చోడానికి వాళ్ల నుదుటి రాత మనం
రాయలేదు
వాళ్లకోసం మనం మనకోసం వాళ్లు
ఇది నిరంతర ప్రయాణం
ఇక్కడ అంతా చోద్యం చూసేవాళ్లే
సాయం చేసేవాళ్లుండరు
శ్రమ బిళ్లని నుదుటి మీద అంటించి
నీ జీవితం ఇదేనని శాసించే
బడా నాయకులు ఇక్కడి పెత్తందార్లు
మట్టి మనుషులు మట్టిలోనే కలిసిపోవాలి
ఇది వాళ్ల సిద్ధాంతం
ఒకరా ఇద్దరా
మట్టిని నమ్ముకున్న వాళ్లు మట్టిలోనే కలిసిపోతున్నారు
అందుకే మట్టిని బాగా పిసుకు
ఈ మట్టిలోంచే విత్తనాలు మొలకెత్తాలి
ఈ మట్టిలోంచే సూర్యుళ్లు బయటకు రావాలి.

–చొక్కర తాతారావు

యేళ్ళ స్నేహంతో పాండురంగ గొంతులో కొంచెం అధికారంతో కూడిన విసుగు ధ్వనించింది.

రామచంద్రం మరి మాట్లాడలేదు.

మరో పదినిమిషాల తర్వాత బజార్లోని ఒక హోటల్లో కూర్చున్నారిద్దరు.

జనం పెద్దగా లేరు..

పాండురంగ పకోడీలకు ఆర్డరిచ్చాడు.

"అదేమిట్రా.. ఇంట్లో తినేవాళ్ళం కదా! మళ్ళీ ఈ హోటల్లో ఎందుకు?" రామచంద్రం అన్నాడు.

"అబద్ధాలు ఎప్పట్నించి చెప్తున్నావ్.. చంద్రం..?" పాండురంగ ప్రశ్నకు బిత్తరపోయాడు రామచంద్రం..

"అబద్ధమా.. అబ్బే.. ఏం.. లేదే.." సమర్థించుకోబోయాడు.

"ఒరేయ్.. కాలింగ్ బెల్ నొక్కటానికి పదినిమిషాల ముందు.. మీ ఇంటిలోని భాగవతం అంతా విన్నాను. తలుపు సరిగ్గా వెయ్యలేదేమో, మీ ప్రత్యక్షరం వినబడింది."

రామచంద్రం ముఖం పాలిపోయింది.

"చంద్రం.. ఇరవైయేళ్ళ స్నేహంరా మనది.. ఎందుకురా బేలెన్స్ కోల్పోతున్నావ్.. ఎంత శాంతంగా ఉండేవాడివి.. ఎందుకురా అలా రియాక్టయ్యావ్..?" పాండురంగ, రామచంద్రం చేతిని ఆప్యాయంగా తడుముతూ అన్నాడు.

"ఏం చెయ్యనురా.. రంగా.. వసంత ఇల్లంతా నరకం చేస్తోంది.. ఏం మాట్లాడకపోతే నాతో మాట్లాడటం నీకు ఇష్టం లేదంటుంది.. మాట్లాడితే, ఏదో మాటకి ఇంకో అర్థం కల్పించుకొని తగాదా మొదలుపెడుతుంది. పెళ్ళంటే నూరేళ్ళ పంట అన్నవాడిని షూట్ చేయాలనిపిస్తుంది. పెళ్ళంటే వంద రకాల సమస్యల ఉరితాళ్ళతో కాళ్ళ కింది మంట.." రామచంద్రం ఉద్వేగంగా అన్నాడు.

"అధికమనే భావన భార్యాభర్తల మధ్య సమస్యలు సృష్టిస్తుంది. ఎవరి ఆధిక్యాన్ని వాళ్ళు నిరూపించుకొనే యత్నంలో సమస్య బిగుసుకుంటుంది. అందుకే విషయం శ్రుతి మించుతున్నప్పుడు భర్తో, భార్యో ఎవరో ఒకరు తగ్గాలి. తప్పేమీ లేదు" పాండురంగ నచ్చచెప్పబోయాడు.

"రంగా.. నేను ఎన్నోసార్లు తగ్గానురా.. అందుకే అలుసయ్యాను. ఇక తగ్గటం నా వల్ల కాదురా.. సహనానికి ఒక హద్దుంటుంది.." రామచంద్రం ఉద్రేకంగా అన్నాడు.

"అందుకని.. కట్టుకొన్న భార్య మీద చెయ్యి చేసుకుంటావా?"

"అవున్రా.. నేను ఆవేశంలో హద్దు దాటాననుకో.. తను ఊరుకుందా.. తను కూడా నా మీద దెబ్బల ప్రయోగం చేసింది.." రామచంద్రం తలదించుకొని నెమ్మదిగా అన్నాడు.

సర్వర్ పకోడీల ప్లేట్లు వాళ్ళ ఎదుట పెట్టి వెళ్ళాడు.

ఇంతలో ఫోన్ మోగింది.

"బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్.." రింగ్‌టోనది.

రామచంద్రం నెంబరు చూసి– "ఆ.. చెప్పరా.. శీను" అన్నాడు.

"... ... ..."

"ఆ.. అలాగే.. నీకెన్నాళ్ళుండాలనిపిస్తే అన్నాళ్ళుండు.. డబ్బు రెండు మూడు రోజుల్లో బ్యాంక్‌లో వేస్తాను. ఏటిఎం కార్డు నీ దగ్గరే ఉందిగా.. డ్రా.. చేసుకో.. ఆరోగ్యం జాగ్రత్త. బాగా చదువుకో. ఉంటా.." అంటూ రామచంద్రం ఫోన్ కట్ చేశాడు.

"మా అబ్బాయి శ్రీను.." పాండురంగ ప్రశ్నించకుండానే ఫోన్ ఎక్కడి నుంచి వచ్చిందో రామచంద్రం చెప్పాడు.

"శీను.. ఇంటర్ చదువుతున్నాడు గదా!"

"ఔను.."

"ఇప్పుడెక్కడున్నాడు..?"

"ఊళ్ళోనే.."

"అంటే.. రెసిడెన్షియల్ కాలేజీలో చేర్పించి, హాస్టల్లో ఉంచావా?"

"రెసిడెన్షియల్ కాలేజీలో చేర్చాను గాని, హాస్టల్లో ఉంచలేదు. వేరే రూం తీసుకొని ఉంటున్నాడు" రామచంద్రం నిర్వికారంగా పకోడి నోట్లో వేసుకొంటూ చెప్పాడు.

"పరిస్థితి చేయి దాటిపోయినట్లుంది గదా!" పాండురంగ బాధపడుతూ అన్నాడు.

"చేతులే ఏమిట్రా.. కాళ్ళు కూడా దాటిపోయింది. ఈరోజులానే నాలుగు నెలల క్రితం మా భార్యా భర్తలిద్దరి మధ్య మాటలు పెరిగాయి. ఆవేశం దెబ్బలాటగా మారింది. ఇద్దరం చదువుకున్న పశువుల్లాగా ఒకరినొకరం కొట్టుకుంటుంటే మా అబ్బాయి శ్రీను బయటి నుంచి సరిగ్గా ఆ టైంకే వచ్చి, మమ్మల్ని చూశాడు.

వాడికి బుద్ధి చెప్పాల్సిన స్టేజీలో ఉన్న నేను, బుద్ధి చెప్పించుకునే స్టేజీలో వాడి కంటబడటం నాకు చాలా అసహ్యమనిపించింది. వాడు మా ఇద్దరికేసి చూసిన చూపులు బాణాల కంటె పదునుగా గుచ్చుకొన్నాయి. తను నా మీద నేరాల చిట్టా వాడికి చదివి వినిపిస్తుంటే, నేను మౌనంగా ఉండిపోయాను. ఆ తర్వాత వాడిని వేరే రూంలో ఉంచి, చదివిస్తున్నాను" రామచంద్రం చెప్పటం ఆపాడు. అతని కళ్ళ వెంట వస్తున్న కన్నీళ్ళని ఆపటం అతనికి కష్టమవుతోంది.

బలవంతాన రుమాలుతో కళ్ళు అద్దుకున్నాడు.

"చంద్రం! రోజులు గడుస్తున్న కొద్దీ బంధం బిగుసుకుంటుందంటారు కదా! మరి.. మీ మధ్య ఎందుకు ఇంత పలచన అయిపోతోంది...?" పాండురంగ ప్రశ్నించాడు.

"నేను ఈ విషయం కూడా ఆలోచించాను. ఎందుకో తనంటే ఒక చెడ్డ అభిప్రాయం కాపురానికి వచ్చిన మర్నాటి నుంచి ఏర్పడింది. అది నాలో తెలియకుండానే పెరిగి పెరిగి, తన మాట వింటేనే అసహనం వచ్చేట్లు తయారయింది. ఇది నా తప్పే.. కాదనను.. "బట్.. ఐ యామ్ హెల్ప్ లెస్" రామచంద్రం నిట్టూర్చాడు.

"ఎందుకని తనంటే ఒక చెడ్డ అభిప్రాయం ఏర్పడింది?"

"ఏం లేదురా... నాకు మా నాన్నంటే చాలా ఇష్టం.. ఆయనకు తిండి పిచ్చి.. మా అమ్మ పోయి చాలా సంవత్సరాలయింది. కొత్త కోడలు వచ్చిందిగదా.. నాలుక తుప్పు వదిలేటట్లు రకరకాలు తిందామని ఆశపడ్డాడు. అక్కడే వచ్చింది కోడలికి, మామకి క్లాష్.

"నేనేం వంట మనిషిగా మీ ఇంటికి రాలేదు మీ అబ్బాయికి భార్యగా, ఈ ఇంటి కోడలిగా వచ్చాను. మీకు రకరకాలు చేసిపెట్టే ఓపిక నాకు లేదు. కావాలంటే హోటలుకి వెళ్ళండి.." అని వసంత కాపురానికి వచ్చిన రెండోరోజే తెగేసి చెబుతుంటే, మా నాన్నలోని 'మామ

గారు' అనే అధికారి తట్టుకోలేకపోయాడు.

"ఏమ్మోవ్.. ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా!" అని మా నాన్న గర్జించాడు. "తెలుసు... నా మొగుడ్ని కన్న తండ్రితో.. ఎప్పుడూ మేత మేయాలనుకొనే మామ గారితో.." అని పెంకిగా నా భార్య జవాబిచ్చింది.

మా నాన్న తట్టుకోలేకపోయాడు.

మాటా మాటా పెరిగింది. సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చిన తర్వాత ఇద్దరూ నా చెవులు నమిలేశారు. ఎవరికి వారు తమదే రైటని, రెండవ వాళ్ళది తప్పని సమర్థించమని కోరారు.

"నాన్నా.. దానిని విసిగించకు.. నీకేం కావాలో చెప్పు.. ఉన్నంతలో రోజూ నీకు తెచ్చిపెడతాను" అని నాన్నతో అంటే.. "ఓరి సన్నాసి.. అప్పుడే అది నిన్ను కొంగున ముడేసిందా? కన్న తండ్రిని అన్ని మాటలంటావటే అని నాలుగు చెప్పాల్సింది పోయి నాకు హితోపదేశం చేస్తున్నావా.. మగాడివిరా వెధవా.. ఆడంగి రేకుల వాడిగా బతక్కు" అని నాన్న నన్ను రెచ్చగొట్టాడు.

"ఈ ఇంట్లో ఉన్న ముగ్గురిలో ఆడంగి రేకుల వాళ్ళము నేను, మా ఆయన మాత్రం కాదు" అని వసంత ఆవేశంతో కయ్యానికి సిద్ధమయింది.

"అంటే నేనా.. నిన్ను.. నువ్వసలు కోడలివేనా.. ఏమిట్రా అలా గుడ్లేసుకొని చూస్తావ్.. అది నీ కన్న తండ్రిని కొజ్జా అంటోందిరా.. చీము నెత్తురు లేవురా నీకు.." మా నాన్న నన్ను పట్టుకొని కదుపుతూ అన్నాడు.

"వసంతా! ఏమిటిది! కాసేపు నోర్మూసుకో!" అన్నాను.

"నేనేమీ నోరు మూసుకోనక్కరలేదు. నేనేమీ ఊరికినే ఈ కొంపకి రాలేదు. మా నాన్న పాతికవేల కట్నంతో మిమ్మల్ని కొనిపెట్టాడు. నేనేం బానిసను కాను. అది ఈ ఇంట్లో అందరూ గుర్తు పెట్టుకోండి" అంటూ వసంత మా నాన్నకేసి విసురుగా చూస్తూ వెళ్ళిపోయింది.

మా నాన్న "దరిద్రపు వెధవా!! అంటూ నన్ను తిట్టి, మా పెద్దన్నయ్య దగ్గరికి వెళ్ళిపోయాడు.

చనిపోయేంత వరకు మళ్ళీ మా ఇంటి గుమ్మం తొక్కలేదు. అదుగో.. అప్పట్నుంచి వసంతంటే మనస్సులో తెలియని బాధ.." రామచంద్రం చెప్పటం ఆపాడు.

"చంద్రం! నీ వైపు నుంచే వసంత గురించి ఆలోచిస్తున్నావ్.. మాట దురుసు మనిషని, కోపిష్ఠురాలని – ఇలా రకరకాల విశేషణాలు ఆవిడకు తగిలించావ్.. కాని చిన్న పొరబాటు చేశావ్రా.."

"నే..నా..?"

"అవున్రా.. ఆవిడ వైపు నుంచి నువ్వు ఆలోచించలేదు. అప్పుడు నీ మనస్సులో తన పట్ల ఉన్న దురభిప్రాయం తొలగిపోయి ఉండేది.

"తనకేం.. తక్కువ చేశాన్రా.." ఇల్లు కట్టించాను. ఓవర్ డ్యూటీలు చేసి నగలు చేయించాను. ఉన్నంతలో తను కోరినవల్లా తీర్చాను."

"చంద్రం! యూ ఆర్ మిస్టేకన్.. జస్ట్.. తన భౌతిక అవసరాలు మాత్రమే నువ్వు తీర్చావ్.. మానసికంగా తృప్తిని కలిగించలేకపోయావు. అందుకే మనస్సుల మధ్య దూరం పెరిగింది. ఫలితంగా ఇంట్లో నిత్యం అశాంతి, సంఘర్షణ.."

"పూర్తిగా అర్థం కాలేదు.."

"అర్థం కాదురా.. అందుకే చాలా సంసారాలు శారీరక సంసారాలు. మీ నాన్నని అంచనా వేశావ్. జస్ట్.. కొంచెం ఆవిడ వైపుగా ఆలోచించి ఉంటే, మీ మధ్య గేప్ వచ్చి ఉండేది కాదు. ఫరెగ్జాంపుల్.. మీ నాన్న ఇంట్లోంచి వెళ్ళిపోయిన రోజు, మీ ఆవిడతో నువ్వు మాట్లాడి ఉండవ్... అవునా."

"అవును.."

"తర్వాత రెండు మూడు రోజుల దాకా కూడా ఆవిడ నీకు పరమ శత్రువులా కనిపించి ఉంటుంది. సారీ.. ఇలా అంటున్నానని ఏమీ అనుకోకు.. తర్వాతెప్పుడో బయలాజికల్ నీడ్ కోసం ఇద్దరూ దగ్గరికి చేరటంతో మళ్ళీ పొడి మాటలు కొద్ది కొద్దిగా మొదలయి ఉంటాయి. నిండు మనస్సుతో మీరిద్దరూ మాట్లాడుకొని ఉండరు.. యా మై రైట్.." పాండురంగ ప్రశ్నించాడు.

"హండ్రెడ్ పర్సెంట్ కరెక్ట్..." రామచంద్రం పాండు రంగ విశ్లేషణకి ఆశ్చర్యపోయాడు.

"బిడ్డ పుట్టిన తర్వాతయినా మీ ఇద్దరి మధ్య కోపతాపాలు సమసిపోలేదంటే, నీ మనస్సులో నాన్న బాధ అనే వేరు ఎప్పటికప్పుడు చిగుళ్ళు పెడుతూనే ఉంది. అందుకే ఈ తన్నులాటలు. ఇలా కాకుండా ఉండాలి అనుకుంటే, – మీ నాన్న వెళ్ళిపోయిన రోజే నీ మగాడి అహంకారం చంపుకొని లాలనగా నీ భార్యతో విషయాన్ని చర్చించి ఉండాల్సింది. మన కోపం ఎదుటి మనిషిని రెచ్చగొడుతుంది. మన ప్రేమ ఎదుటి మనిషిని కరిగిస్తుంది. "నువ్వు తప్పు చేశావ్!" అని మనం అనకూడదు. "నేను తప్పు చేశానన్న భావన ఎదుటి వారిలో కలిగించాలి. ఇది కేవలం ప్రేమతో సాధ్యమయ్యే పని. మాటలలో చెప్పినంత తేలిక కాదుగాని, ప్రయత్నం మొదలుపెడితే కష్టం కూడా కాదు" పాండురంగ చెప్పటం ఆపాడు.

"నిజమేరా రంగా.. ఎప్పుడు మా మధ్య కొట్లాట వచ్చినా, తన మీదకే అంతా తోసేసేవాడిని. కారణం తనే అనుకొనే వాడిని. ఇదివరలో ఉన్న చెడు భావనకి మరింత ఆజ్యం పోసేవాడిని. కాని, నువ్వు చెప్పినట్లు – తన తరపు నుంచి ఆలోచిస్తే, ఒకవేళ నేను తప్పుచేసి ఉంటే నా తప్పూ తెలిసేది. తను తప్పు చేసి ఉంటే, ప్రేమతో – ఆ విషయాన్ని ఆవిడకు తెలిసేట్టు చెప్పుంటే.. ప్చ్.. ఎంత బాగుండేది.. రంగా.. చేజేతులా ఇరవైయేళ్ళ జీవితాన్ని నాశనం చేసుకున్నాను.." రామచంద్రం బాధపడ్డాడు.

"నా చేతులు కాలిన తర్వాత.. నిన్ను సందేశాల ఆకులు పట్టుకొమ్మని చెబుతున్నాను.." పాండురంగ అన్నాడు నవ్వుతూ.

"ఏంట్రా.. నువ్వనేది.." రామచంద్రం అర్థంగాక అడిగాడు. పాండురంగని కలిసి అయిదు నెలలయింది. ఇద్దరూ ఫోన్లలో మాట్లాడుకునేవారు గాని, ముఖాముఖి కలుసుకోవటం అయిదు నెలల తర్వాత ఇదే మొదటిసారి. ఇద్దరివీ పక్కపక్క ఊళ్ళలో ఉద్యోగాలు.

"ఏమన్నా ప్రాబ్లమా!" జవాబు చెప్పని పాండురంగని రామచంద్రం రెట్టించాడు.

"ఒక ప్రాబ్లం తీరింది.. మరొకటి మొదలయింది"

"అంటే.."

"ఏముందిరా! ఒకరి మీద ఒకరం కారాలు మిరియాలు నూరుకునే ప్రాబ్లం మా భార్యా భర్తలిద్దరికి విడాకుల రూపంలో కోర్టు తొలగించింది ఈరోజే. భార్య లేని ప్రాబ్లం మొదలయింది"

పాండురంగ మాటలకి రామచంద్రం షాకయ్యాడు.

"ని..జ..మా.." రామచంద్రం ఆర్తితో అడిగాడు.

"నిజమేరా.. అందుకే మా ఇంట్లో ఏం తోచక, మీ ఇంటికి వచ్చి సరదాగా గడుపుదామని వచ్చాను. మీ ఇంట్లోనూ అలా ఉంది. సరే.. ఏదన్నా సినిమాకు వెళ్దామని నిన్ను తీసుకొని బయటికి వచ్చాను.." పార్టీ కూడా ఇస్తాలే.. టేక్ యువర్ ఓన్ డిష్..." పాండురంగ జీవచ్ఛవంలా నవ్వుతూ అన్నాడు.

"ఐ యాం సారీ.." రామచంద్రం బాధగా చెప్పాడు.

"నో..నో.. నా అనుభవ సారం నీకు పనికిరావాలి. ఎదుటివాడికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయన్న ఆత్రేయకు థాంక్స్.. నేను నీకు సారీ చెప్పే పరిస్థితి తెచ్చుకోకు.." పాండురంగ నవ్వాలని ప్రయత్నిస్తూ అన్నాడు.

"నీ వైఫ్ అడ్రస్ కావాలి.." రామచంద్రం లేస్తూ అన్నాడు.

"ఎందుకు?" అని పాండురంగ ప్రశ్నించలేదు.

ప్రేమ వెలుగుకి ఏ చీకటయినా తొలగిపోతుందన్న దానికి గుర్తుగా హోటల్లో లైట్లు వెలిగాయి. ■

## నానోలు

విరుస్తుంది
విరుగుతుంది
సింగిడీ
జీవితం–
కాటి
కాపరికి
శ్మశానం
కాపలా–

గ్లోబ్
విల్లేజంత
దోపిడి
గ్లోబంతా–
వ్యక్తమైతే
ఉగ్రవాదం
అవ్యక్తమైతే
అగ్రరాజ్యం–

పావురాన్ని
వదిలెయ్
పంజరాన్ని
కాల్చెయ్–

–ఈగ హనుమాన్